# కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే..



మంత్రికి ఘనస్వాగతం పలుకుతున్న దివిటిపల్లి గ్రామస్తులు

- మోసకారులను నమ్మితే గోసపడుతాం
- ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటా
- మహబూబ్‌నగర్ అభివృద్ధే లక్ష్యం
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ టౌన్, నవంబర్ 19 : కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనని, ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని దివిటిపల్లి, అంబటిపల్లి గ్రామాల్లో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు దివిటిపల్లి ఎలా ఉండేది, నేడు ఎలా మారిందో మీ కళ్లముందే కనిపిస్తుందన్నారు. ఐటీ పార్కుతోపాటు మరిన్ని కంపెనీలు వస్తున్నాయని, దీంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. డబుల్‌బెడ్రూం ఇండ్లు, బీటీ రోడ్డుతోపాటు భవిష్యత్‌లో మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎన్నికల సమయంలో మోసం చేసే నాయకులు వస్తుంటారు, పోతుంటారని, ప్రజల మధ్య ఎవరుండి అభివృద్ధి చేస్తారో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కుల,మత రాజకీయాలు చేస్తారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు బంధు బంద్ చేయించారన్నారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని, కష్టాల్లో పలుపంచుకునే బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని పిలుపునిచ్చారు. 70ఏండ్లు పాలించి ప్రజలను ఎన్నో ఇబ్బందులు పెట్టారని గుర్తుచేశారు. కరోనా సమయంలో అండగా ఉన్నాం, ఎవరికి ఆరోగ్యం బాగా లేకున్నా ఆదుకున్నామన్నారు. గత పాలనలో రోడ్లు, తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మహబూబ్‌నగర్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేశానన్నారు. గత పాలకులు రూ.200 ఫించన్ ఇస్తే, మేం వచ్చిన తర్వాత రూ.1,500 నుంచి రూ.2,016, దివ్యాంగులకు రూ.3,016 చేశామన్నారు. ఆసరా ఫించన్ రూ.2,016 నుంచి రూ.5,016, దివ్యాంగుల ఫించన్ రూ.6,016 పెంచుతామని తెలిపారు. ప్రతి మహిళకు భృతి రూ.3వేలు, రైతుబంధు రూ.16వేలు, కేసీఆర్ బీమా రూ.5లక్షలు, ప్రతి ఇంటికి సన్నబియ్యం, అగ్రవర్ణాలకు నూతన గురుకులాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి సమస్యలు తీర్చే నాయకుడికి అండగా ఉండాలన్నారు. మహబూబ్‌నగర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతకుముందు మంత్రికి దివిటిపల్లి, అంబటిపల్లిలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, దివిటిపల్లి సర్పంచ్ జరీనాబేగం, ఎంపీపీ సుధాశ్రీ, వైస్ ఎంపీపీ అనిత తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్,బీఆర్‌ఎస్ నాయకులు

**బీఆర్‌ఎస్‌లో చేరికలు..**

మహబూబ్‌నగర్ అర్బన్ మండలం దివిటిపల్లిలో గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు నరేశ్, విజయ్, రాజు, రవి, వంశీయాదవ్, శ్రీకాంత్‌తోపాటు 40మంది మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

**జిల్లా కేంద్రంలో పలువురు..**

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 19 : జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో హన్వాడ మండలం కొత్తపేటకు చెందిన బీజేపీ ఎస్సీ సెల్ మోర్చా జిల్లా నాయకుడు కృష్ణయ్య, అధ్యక్షుడు ఆంజనేయులుతోపాటు 50మంది, 19వ వార్డు టీచర్స్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ, సౌజన్య, భార్గవి, అనూష, శ్రావణి, మమతతోపాటు 50మంది, వీరన్నపేట హీరాబాయి దాడితండాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు విజయ్, రవినాయక్, గోవింద్‌నాయక్‌తోపాటు 100మంది మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం

- బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి
- కారుగుర్తుకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి



కార్యకర్తలతో కలసి డప్పు కొడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నవంబర్19 : బీఆర్‌ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాయని జడ్చర్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 8, 26వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మొదటగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ, ప్రశాంత్‌నగర్‌కాలనీల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్లీ తాగునీళ్లు, కరెంటు కష్టాలు వస్తాయని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాలంటే బీఆర్‌ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డు వెంకటేశ్వరకాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌వి వారెంటీ లేని గ్యారెంటీలు

- మక్తల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాం
- మరోసారి ఆశీర్వదిస్తే మరింత ప్రగతి సాధిస్తాం
- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్ టౌన్/ఊట్కూర్, నవంబర్ 19: అభివృద్ధిని చూసి ప్రజలు మరోమారు ఆశీర్వదిస్తే మరింత ప్రగతి సాధిస్తామని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ ఆంజనేయగౌడ్, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యురాలు చిట్టెం సుచరితారెడ్డిలతో కలిసి ఆదివారం మక్తల్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక నల్లజానమ్మ ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమై రజకవాడ, నేతాజీనగర్, మారుతీనగర్ యాదవనగర్, కుర్వ తాయమ్మకట్ట, బ్రాహ్మణవాడీ, గాంధీచౌక్, రెడ్డి నగర్, ఆజాద్‌నగర్ మీదుగా జాతీయ రహదారి వద్ద గల అంబేద్కర్ చౌరస్తా వరకు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో మక్తల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24గంటల ఉచిత కరెంటు ఇస్తున్నది కేవలం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. పుట్టిన ప్రతి బిడ్డ నుంచి పండు ముసలి వరకు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘన చరిత్ర సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రైతులు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమాన్ని ఏనాడు పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. ప్రజా ఆశీర్వాద సభ సందర్భంగా సీఎం కేసీఆర్ హామీలను ఎన్నికలు అయిపోయిన వెంటనే తిరిగి సీఎంను ఆహ్వానించి అమలు చేస్తామన్నారు. ప్రాణ త్యాగం చేసిన చరిత్ర కలిగి ఉన్న తన కుటుంబంపై కొందరు విమర్శలు చేస్తున్నారని, మరి వారికి ఉన్న చరిత్ర ఎలాంటిదో మక్తల్ ప్రజలు గుర్తించుకోవాలన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ప్రజలు మరోమారు గెలిపించాలని కోరారు. 23న మక్తల్ పట్టణంలో నిర్వహించే కేటీఆర్ రోడ్ షో కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలకాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసిన చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజమ్మ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గుప్తా, కౌన్సిలర్లు శ్వేతారెడ్డి, ఇర్ఫానా సుల్తానా, రాములు, మొగులప్ప, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసే చేరికలు

- అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి
- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

భూత్పూర్, నవంబర్ 19 : బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని చూసే కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గులాబీ పార్టీలో చేరుతున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్ ఇంట్లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో 100మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గౌస్, షబ్బీర్‌తోపాటు 45మంది మైనార్టీ యువకులు, అమిస్తాపూర్‌కు చెందిన కెంద్యాల తిరుపతయ్య ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ నాయకుడు గుంత దిలీప్, మంగ నారాయణతోపాటు 60మందికి పైగా మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన వారితో సీనియర్ నాయకులు కలిసి పని చేయాలని కోరారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. కార్యక్రమంలో ముడా డైరెక్టర్లు చంద్రశేఖర్‌గౌడ్, సాయిలు, బీఆర్‌ఎస్ నాయకులు అహ్మద్, యాసిన్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి ఆశీర్వదించాలి

- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- నారాయణపేటలో ముమ్మరంగా ప్రచారం

నారాయణపేట రూరల్, నవంబర్ 19 : నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పేరపళ్లలో ఇంటింటి ప్రచారం చేపట్టగా, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 55ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ సాధించని అభివృద్ధిని కేవలం పదేండ్లలోనే సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ సర్కారు కృషి చేస్తున్నదని, ప్రజలంతా అండగా నిలవాల్సిన అవసరమున్నదన్నారు. రూ.వందల కోట్లతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ నాయకులు మోసపూరిత హామీలు ఇచ్చి మళ్లీ తెలంగాణను ఆగం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, ఓట్ల కోసం అమలు కాని హామీలు ఇస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలో ఇచ్చిన గ్యారెంటీలకే దిక్కులేక ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతుంటే తెలంగాణలో అధికారమిస్తే చీకటి కావడం ఖాయమన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, లేదంటే బతుకులను ఆగం చేస్తారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలోని హామీలను ప్రజలకు వివరించారు. ప్రజలు ఆగం కావొద్దని, ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ, అంజలి, పీఏసీసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ శ్రీదేవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాములు, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పేరపళ్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి